


*(గత సంచిక తరువాయి)*

అప్పుడు మా ఇంటికి వచ్చిన మావయ్య "ఒరేయ్ నేను సహాయం చేస్తాను. ఇలా రా, నీకెలాంటి ఇల్లుకావాలి" అన్నాడు. నేను అప్పట్లో చూసిన ఒక సినిమాలో ఇల్లు లాంటిది కావాలన్నాను. సరే ఐతే అని వెంటనే కొన్ని రంగు కాగితాలు, అట్ట ముక్కలు ఇంకా వేరే సరంజామా కొని తెచ్చి మావయ్య ఇల్లు కట్టడం మొదలుపెట్టాడు.

చక చకా మావయ్య కొన్ని గంటల్లోనే ఒక అద్భుతమైన ఇంటి నమూనాని నా కళ్ల ముందే కట్టాడు.

జీవితంలో మర్చిపోలేని ఆ సుందర కట్టడానికి మావయ్య నేను చెప్పినట్లే శ్రీ నిలయం అనే పేరు కూడా తగిలించాడు.

మన స్కూల్ వాళ్ళు ప్రిన్సిపాల్ గారి అబ్బాయికి తనొక మూడంతస్తుల మేడ కట్టినందుకు ఫస్ట్ ప్రైజ్ ఇచ్చి, ఎంతో అద్భుతంగా ఉన్నా మావయ్య కట్టిన శ్రీ నిలయానికి సెకండ్ ప్రైజ్ ఇచ్చారు. అందరూ నన్ను కూడా చాలా మెచ్చుకున్నారు. ఐతే ఈ బహుమతి రావటంలో నా కృషి ఏమీ లేదు. కానీ పాపం! నిజ జీవితంలో మావయ్య ఎప్పటికీ ఒక స్వంత ఇంటి యజమాని కాలేక పోయాడు.

శ్రీమన్! మావయ్యతో సంబంధమున్న ఒక గమ్మత్తు సంఘటన చెబుతాను విను. నాకు మన స్కూల్ దగ్గరున్న పెద్ద నీలగిరి చెట్టు, దాని మంచి సువాసన ఉన్న ఆకులు ఇంకా పసుపు పచ్చ రంగులో చిన్నగొట్టాల్లాగా ఉండే పూల మొగ్గలు చూస్తే చాలా బావుండేది. ఈ చిన్నగొట్టాలను చిన్నగ్లాసులు అంటూ నేల మీద పడ్డ వీటిని ఏరుకుని పిల్లలం వాసన చూస్తుండే వాళ్ళము.

ఒక సారి నేనలా ఈ గొట్టాల వాసన గట్టిగా చూస్తుంటే ఒకటి నా ముక్కులోకి వెళ్ళిపోయింది. ఇక అది బయటకి రాకుండా నన్నుశ్వాస కూడా తీసుకోవడానికి ఇబ్బంది పెడుతుంటే ఇంటికొచ్చి అమ్మకి చెప్పాను.

అమ్మ చాలా కంగారు పడింది. సరిగ్గా అప్పుడే మావయ్య మా ఇంటికి వచ్చాడు. నన్ను ఏదైనా హాస్పిటల్ కి తీసుకెళ్ళమని అమ్మ తొందరపెడితే మావయ్య "నువ్వు కంగారు పడకు అక్కా, నేను చూస్తాను" అని ఆలోచించడం మొదలు పెట్టాడు. వెంటనే అమ్మని పిలిచి ఒకటి చెప్పాడు.

అది విని అమ్మ వంటింట్లోకి వెళ్లి ఒక డబ్బా తెచ్చింది. మావయ్య నన్నుకూర్చోబెట్టి ఆ డబ్బా మూత తీసి నా ముక్కుకు దగ్గరగా పెట్టి తీసేసాడు.

అంతే! నేను గట్టిగా తుమ్మాను. దెబ్బకి ఆ గొట్టం నా ముక్కులోంచి ఊడి నా చొక్కా జేబులో పడింది. అందరూ ఒకటే నవ్వు మావయ్య సమయస్ఫూర్తితో చేసిన ఆ పనికి. ఇంతకీ మావయ్య ఏం చేసాడంటే నా ముక్కు దగ్గర కారం డబ్బా పెట్టాడు. చాలా సులభంగా నా సమస్యని పరిష్కరించినందుకు బామ్మ బాగా మెచ్చుకుని "బాబు తెలివైన వాడు. వీడి బుద్ధి కూడా సరిగ్గా ఉంటే ఇంకెంత బావుండేది" అనింది.

ఇంకొక సారి ఏమైందంటే ఒక రోజు స్కూల్ విడిచే సమయానికి వాన మొదలైంది. ఇక నేనూ కేశవ గారబ్బాయి చందూ పరుగు తీసాము. చందు వాళ్ళ ఇంటి కంటే ముందే మా ఇల్లు వస్తుంది. కానీ నేను మాత్రం మా ఇంటి వైపు సందు కాకుండా చందుతో పాటు పరుగు తీసి వాళ్ళింటికి వెళ్ళిపోయాను.

సమయానికి నేనింటికి వెళ్లకపోయే సరికి నేనెక్కడికెళ్లానో తెలియక ఇంట్లో వాళ్ళు ఎంతో కంగారు పడ్డారు. స్కూల్ దగ్గర అంతా వెతికి నేను కనిపించక పోయేసరికి, అమ్మకి ఏం చేయాలో తెలియక మావయ్యకి కబురు పెట్టింది. మావయ్య వచ్చి సంగతి తెలుసుకుని ఆలోచించి నేను రోజూ ఎవరితో పాటు స్కూల్ నుంచి వస్తానో ఊహించి, నేరుగా వారాశిగూడ వెళ్లి నా గురించి ఆరా తీసాడు.

కొద్ది సేపటికే మావయ్యకి తెలిసింది నేను కేశవ గారింట్లో ఉన్నానని. ఇక మావయ్య నన్ను తీసుకుని ఇంటికి వెళ్లేసరికి సాయంత్రమయ్యింది. అమ్మ కోపంతో ఊగిపోతూ ఏడుస్తూ నన్ను కొట్టడానికి వచ్చింది. మావయ్య అందరికీ సర్ది చెప్పాడు వంశీ ఏదో తెలియక చేసాడు, దీన్ని పెద్దగా చేసి ఇంకోసారి వాడు మళ్ళీ వెళ్ళడానికి కారణమవ్వద్దని. ఆ రోజు మావయ్య నన్నుఇంట్లోవాళ్ళ పెద్ద శిక్ష నుంచి తప్పించాడు. ఇలా చిన్నప్పుడు మావయ్యతో నాకు కొంచెం అనుబంధం ఉండేది. పాపం, మావయ్య కూడా అమ్మని, మమ్మల్ని ఎప్పుడైనా సంతోష పెట్టాలని ప్రయత్నించే వాడు.

అందుకే మావయ్య ఒక సారి "అక్కా! నువ్వు ఎప్పుడూ మా అత్తగారి వాళ్ళ ఊరు చూడలేదు. ఇంకా పిల్లలు కూడా పల్లెటూరు, పొలాలను చూడాలని ఉందని ఎప్పుడూ అంటారు కదా. అందుకే నిన్నూ, పిల్లలనూ వాళ్ళ ఊరు తీసుకెళదామనుకుంటున్నాను" అని హడావిడి పెట్టాడు.

అమ్మ "ఏంట్రా చెప్పా పెట్టకుండా ఉన్నట్లుండి ఈ హడావిడి? మీ బావని కూడా అడగనీ" అనింది.

దానికి మావయ్య "నేను ప్రొద్దున బావకి వాళ్ళ ఆఫీస్ దగ్గర చెప్పి పర్మిషన్ తీసుకున్నానులే" అన్నాడు.

అమ్మకి సంతోషం వేసింది. తాను మావయ్యతో ఇదే మొదలు ఎప్పుడైనా బయటి ఊళ్ళకి వెళ్లడం. అమ్మ "సరే అక్కడ ఎన్ని రోజులుంటాం? పిల్లలకి కూడా స్కూల్ ఉంది కదా" అంది.

"రెండ్రోజుల్లో తిరిగి వచ్చేద్దాం. ఏం ఫరవాలేదు" అన్నాడు మావయ్య. ఇక అమ్మ మా బామ్మతో చెప్పి నన్నూ, లక్ష్మి అక్కని తీసుకుని మావయ్యతో బయలుదేరింది. చెల్లాయి దామిని ఎప్పుడూ బామ్మ కూచి. అది నేను బామ్మ దగ్గరే ఉంటాను అని ఇంట్లోనే ఉండిపోయింది.

ఆ రోజు రాత్రే ఇలా మేము అనుకోకుండా సికింద్రాబాద్ నుండి విజయవాడకి వెళ్లే పాసెంజర్ రైల్లో ఎక్కి బయలుదేరాము. తెల్లవారు జామున ఇంకా చీకటిగానే ఉండగా బోనకల్లు అనే స్టేషన్లో దిగాము. అక్కడి నుంచి జట్కా బండిలో సింగారం అనే పల్లెటూరుకు తెల్లవారేసరికి చేరాము.

మావయ్య తన అత్తగారింట్లో మమ్మల్నితీసుకు వస్తున్నట్లు చెప్పలేదు కాబట్టి వాళ్లంతా చాలా ఆశ్చర్యపోయారు. ఆ మధ్యే మావయ్య వాళ్ళ మామగారు ఉపాధ్యాయ పదవి నుండి రిటైర్ అయ్యారు. ఆయన ఆర్ధికంగా గొప్ప స్థితిలో లేరు. అందుకే అమ్మకు ఇలా చెప్పకుండా వచ్చి వాళ్ళను ఇబ్బంది పెట్టామా అని బాధ వేసింది.

మావయ్య వాళ్ళ అత్తగారు "మీరు రావడం మాకెంతో సంతోషంగా ఉంది. ఇలాగైనా మా ఇంటికి వచ్చారు" అని వెంటనే మాకు స్నానాదికాలు తరువాత కాఫీ, టిఫిన్ ఏర్పాట్లు చేసేసారు.

ఇక లక్ష్మి అక్క మావయ్యతో "ఏదీ నాకు పొలం చూపించవా" అని మావయ్యని అడగడం చూసి, వాళ్ళ మావగారు "అయ్యో ఇప్పుడు పొలం దగ్గర ఏముంటుంది, వారం రోజుల క్రితమే వేరుశనగ పంట కోసి అమ్మకం కూడా అయిపోయింది" అన్నారు.

అయినా మావయ్య మమ్మల్ని చాలాసార్లు పచ్చని పొలాల గురించి చెప్పి ఊరించాడు కాబట్టి "ఫరవాలేదు లెండి. నేను ఊరికే వీళ్ళని అలా చూపించి తీసుకొస్తాను" అని వాళ్ళ మావ గారికి చెప్పి ఆ పొలం దగ్గరికి తీసుకెళ్లాడు. వాళ్ళ మావగారిది చిన్న పొలమే. ఆయన అన్నట్లు ఇప్పుడు అక్కడ ఏమీ లేదు, పంట కోత తరువాత మిగిలిన ఎండు గడ్డి తప్పితే. అయినా మేము ఉత్సాహంగా ఆ పొలంలోకి దిగి మిగిలిన కొన్ని చిన్నా చితకా వేరుశనగలు సంపాదించి సంతోష పడ్డాము. తర్వాత మావయ్య దారిలో తాటి ముంజెలు కూడా దింపిస్తే అవి కూడా తిన్నాము.

చిన్నప్పటి నుండీ సికింద్రాబాద్ లోనే ఉండడం వలన మాకు పల్లెటూరి వాతావరణం ఇంకా పొలాలంటే ఎంతో ఉత్సాహంగా ఉండేది. అందుకే ఆ చిన్నసరదాలకే మేము చాలా ఆనందించాము. ఇక అక్కడినుంచి కొంచెం సేపు అటూ ఇటూ తిరిగి భోజనం సమయానికి వాళ్ళింటికి చేరుకున్నాము. మావయ్య వాళ్ళ అత్తగారు భోజనంలో ఘుమ ఘుమలాడే నెయ్యితో పాటు వడ్డించిన గోంగూర చింత కాయ పచ్చడి భలే రుచిగా మాకు తెగ నచ్చేసింది.

ఆ రోజు చీకటి పడే సరికల్లా ఆ ఊరంతా సద్దు మణిగి ఎక్కడో చిన్న విద్యుత్ దీపాలతో కొంత మాత్రమే

వెలుగుతో పూర్తిగా నిశ్శబ్దంగా ఉండేసరికి మాకెంతో ఆశ్చర్యమేసింది. వాళ్ళ ఇంటి బయట ఆవరణలో నులక మంచాలపై పడుకుని చక్కగా కనిపిస్తున్న నక్షత్రాలను లెక్క పెడుతూ, కబుర్లు చెబుతూ చాలా త్వరగానే మాకు తెలియకుండానే నిద్రలోకి జారుకున్నాము.

ఆ మర్నాడు ప్రొద్దున్నే మావయ్య మమ్మల్ని ఆ ఊరుకి దగ్గర పెనుగంచిప్రోలులో తిరుపతమ్మ గుడికి తీసుకెళ్లాడు. అమ్మవారి పురాతన దేవాలయం మా అందరికీ భలే నచ్చింది. దైవదర్శనం తరువాత తిరిగి సాయంత్రానికల్లా మేము బోనకల్లు చేరుకొని, ఆ రాత్రే సికందరాబాదుకు తిరుగు ప్రయాణమయ్యాము.

నేను మావయ్యతో ఎక్కువసేపు కలిసి ఉన్నది చిన్నప్పుడు ఈ ప్రయాణంలోనే. తరువాత ఎప్పుడూ మళ్ళీ నేను మావయ్యతో ఇలా కలిసి గడపలేదు. అందుకే ఇది నాకొక మర్చిపోలేని సంఘటన.

ఐతే, నేను కొంచెం పెద్దయ్యే సమయానికి మావయ్యతో నా అనుబంధం బలహీనపడటం మొదలయ్యింది. ఒకటి రెండు సార్లు మావయ్య త్రాగి మా ఇంటికి వచ్చాడు. తాను కంట్రోల్ లోనే ఉన్నాననుకొని మా అమ్మతో, బామ్మతో ఏదో ఎక్కువ మాట్లాడాడు.

అసలే అమ్మకి తాగే వాళ్లంటే చాలా భయం. ఇక బామ్మకైతే విపరీతమైన అసహ్యం. ఎలాగో మావయ్యని బయటకు పంపించినా మావయ్య వెళ్ళిపోగానే బామ్మ ఎంతో చీదరించుకుని అస్సలు భరించలేకపోయింది. బామ్మకి మావయ్య మీద కలిగిన జుగుప్స ఇంకా కోపం నాకొక జీవితాంతం గుర్తుండే హెచ్చరిక లాగే పని చేసింది.

పెద్దవుతున్న కొద్దీ మావయ్య ప్రవర్తన తనకి సంబంధించిన సంఘటనలు నన్ను కలవర పెట్టడం మొదలైంది. మావయ్య ప్రభావం నా మీద పడకూడదని చాలా భయపడే వాడిని.

అందుకే మావయ్య ఎడమ చేతివాటం నాకు కూడా వచ్చిందని చుట్టాలంటుంటే నచ్చక నాకేమనాలో అర్థమయ్యేది కాదు. నిజం చెప్పాలంటే మావయ్యకున్నతెలివితేటలు, పని నేర్పు, చిత్రలేఖన నైపుణ్యం వంటి గొప్ప లక్షణాలు నాలో లేవు. ఐనా వీటన్నిటి కన్నాముఖ్యం తన సాంగత్యం మాత్రం నా మీద దుష్ప్రభావం చూపకూడదని తలచేవాడిని.

నిరంతరం వెంటాడుతున్నమావయ్య దైన్య పరిస్థితి నా ఉద్దేశంలో అది చాలా వరకు తన స్వయంకృతమే అనిపించేది. అందుకే తన మీద జాలి పడేవాణ్ని కాదు. తన పరిస్థితుల ప్రభావం మా కుటుంబం ప్రత్యేకంగా అమ్మ మీద జీవితాంతం పడకూడదనే నేను అమ్మ అంత కఠిన నిర్ణయం తీసుకోవడానికి కారకుడయ్యాను.

ఇప్పుడు వయసొచ్చాక కొంచెం పరిణితి చెందిన తరువాత ఆ సమయంలో నేను చేసిన పనిని ఏమని వర్ణించాలో అర్థం కాని మనోవేదన నాది. ఏమైనా మావయ్య తన రక్త సంబంధాన్ని కూడా వదులుకుని అమలు

పరచిన అత్యంత అభిమానపూరితమైన జీవిత వాగ్దానమది. అమ్మా, మావయ్య ఆ తోబుట్టువులిద్దరు తమ అనుబంధాన్ని, జీవిత కాలపు ప్రేమని మా కోసం అర్పించిన చిరస్మరణీయ త్యాగమది.

నాకు తెలుసు అమ్మ తన బాధని ఇప్పటికీ మౌనంగా లోలోన భరిస్తోందని. అమ్మ తన గుండె రాయి చేసుకుని అందరికీ మావయ్య ఉనికినే చెరిపేసి తన జ్ఞాపకాలనెప్పుడూ ప్రస్తావించకుండా బ్రతుకుతోంది.

శ్రీమన్! దీన్ని నీతో గానీ మరెవరితో గానీ నేను ఎప్పుడూ ప్రస్తావించక పోయినా, నేను చేసిన ఆ పని తప్పో ఒప్పో అది మా కుటుంబానికి ఎంత ప్రయోజనం చేసినా నన్ను మాత్రం జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది.

శ్రీమన్! మీ విజయ్ బాబు గురించి నీకు ఇప్పటివరకు తెలియని ఒక సంచలన విషయం చెబుతాను విను.

మావయ్య మా ఇంటికి రావటం మానేసిన కొన్నేళ్ల తరువాత నేను వారాశిగూడలో ఒక సారి మావయ్యని బజార్లో చూసాను. మావయ్య చక్కగా టక్ చేసుకుని, షూస్ వేసుకుని చాలా చక్కగా కనపడ్డాడు. నాకు చాలా సంతోషం వేసింది మావయ్యని అలా చూడటంతో.

బంధువుల ద్వారా నాకు తెలిసిందేమిటంటే మావయ్య మంచి ఉద్యోగం సంపాదించి చక్కగా ఉన్నాడని. ఇంకా ఒక ఆశ్చర్యకర విషయం ఏమిటంటే మావయ్య తెలివితేటల పట్ల ఆకర్షితురాలైన తన సహోద్యోగిని, మావయ్య జీవితం గురించి తెలుసుకుని కూడా తన జీవిత భాగస్వామిని కాగోరి, తనకు చేదోడు వాదోడుగా ఉంటానని బలవంతపెట్టి పెళ్లి చేసుకుందట.

పోనీలే! మావయ్యకి కనీసం ఈ అమ్మాయి అదృష్టమైనా తోడై ఆయన దశ తిరుగుతుందేమోనని అనుకుంటే మావయ్యకి ఇది కూడా ప్రాప్తం లేదు. ఇది జరిగిన కొన్నాళ్లకే తన క్షీణించిన ఆరోగ్యంతో మావయ్య అకస్మాత్తుగా ఈ లోకం విడిచివెళ్ళాడు.

వంశీ ఇంత వరకూ చెప్పింది విని నిర్ఘాంత పోయిన నేను "కొందరి జీవితాలంతే. పాపం! బ్రతుకంతా సంఘర్షణే. కానీ ఇది చెప్పు వంశీ! నువ్వు విజయ్ బాబు మరణం గురించి తెలిసిన తరువాత చూడటానికి ఎందుకు వెళ్ళలేదు" అన్నాను.

"ఏం వెళతాను రా! నాకు ఈ సంగతి తెలిసే సరికి ఆలస్యమయింది. తరువాత వెళ్లినా నా వల్ల పూర్తిగా దూరమైన ఆ కుటుంబాన్నిఏమని ఓదారుస్తాను? అదంతే! ఒక ముగిసిన అధ్యాయం" అని వంశీ అన్నాడు.

అప్పుడు వంశీతో నేనన్నాను "బాల్యంలో నిరాదరణకి గురైన వ్యక్తుల జీవన గమనం ఎటువంటి ఆటుపోట్లకు, అస్తవ్యస్త నడతకు దారి తీస్తుందో ఎప్పటికీ సరి దిద్దుకోలేనంతగా వారి మస్తిష్కంపై దాని ప్రభావం పడుతుందో, నాకు విజయ్ బాబు జీవితం ద్వారా తెలిసిందని"

విజయ్ బాబు గురించి ఆలోచిస్తుంటే నాకనిపించింది లోపించిన తల్లిదండ్రుల సక్రమ సంరక్షణ ఇంకా

ఆర్థిక లేమి ఒక వ్యక్తి ఆలోచనా విధానాన్ని, నడవడికని అంతలా ప్రభావితం చేస్తాయాని?

వంశీ అన్నాడు "నిజమేరా, దీనితో నేను ఏకీభవిస్తాను. కానీ ఎంత దుర్భర పరిస్థితులు ఎదురైనా తిండికి పస్తులున్నప్పుడు కూడా నైతికతను వీడకుండా, ఆత్మ విశ్వాసం కోల్పోకుండా కష్ట పడి కాలక్రమాన మంచి వృద్ధిలోకి వచ్చిన వాళ్ళు చాలా మందే ఉన్నారు.

నీకు తెలుసు కదా ఈ విషయంలో దీనికి ఉదాహరణ మా తాత రామనాధం, రామేశ్వరి బామ్మల సంతానమే.

అతి సంపన్న దశ నుండి రోజుకు పొట్ట గడవని స్థితికి రావలసి వచ్చినా వారెప్పుడూ తమ ఆత్మవిశ్వాసం, అభిమానం వీడలేదు. మా తాతా, బామ్మా కూడా అతి క్లిష్ట పరిస్థితులలోనూ అన్యాయపు సొమ్ము ఆశించలేదు. పై పెచ్చు అక్రమ సంపాదనని అసహ్యించుకునే మానసిక స్థైర్యాన్ని తమ పిల్లలకు కూడా నేర్పించారు. కాబట్టే వాళ్ళెవరూ దారి తప్పి ఇంకొకరు వేలెత్తి చూపే పరిస్థితి తెచ్చుకోలేదు"

వంశీ ఇంకో ఉదాహరణ చెప్పాడు

"శ్రీమన్, మావయ్య మేనత్త కొడుకు వినోద్ ఇంకా మావయ్య ఇద్దరూ సమ వయస్కులే, సహాధ్యాయులే కదా. నేనొప్పుకుంటాను వినోద్ కి కుటుంబ అండ లేకపోవడం, తీవ్రమైన ఆర్థిక లేమి వంటివి ఎదురు కాలేదు నిజమే. కానీ, ఇద్దరికీ యవ్వనపు ప్రలోభాలు సమానంగానే ఉన్నా వినోద్ తన వ్యక్తిగత స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోలేదు.

మావయ్య అంతటి తెలివి, ప్రతిభ లేకపోయినా వినోద్ అంచెలంచెలుగా స్వయంకృషితో ఉన్నత చదువులు చదివాడు. తన బంధువర్గంలో మొట్ట మొదటిగా విదేశానికి వెళ్లి మంచి ఉద్యోగం సంపాదించి బాగా స్థిరపడడమే కాకుండా తన తోబుట్టువుల మంచి జీవితానికి కూడా తోడ్పడ్డాడు"

వంశీ చెప్పిన దానికి నేనన్నాను "ఒరేయ్ వంశీ! విజయ్ బాబు కష్టాల ముందు వినోద్ పడ్డ కష్టమెంత? బాల్యం నుంచీ విజయ్ బాబు లాంటి పరిస్థితులు ఎదుర్కోలేదు కదా. వినోద్ యవ్వన ప్రలోభాలకు లొంగలేదు, బాధ్యతగా పైకొచ్చాడు కానీ ఇందులో పెద్ద గొప్ప ఏముంది" అని.

దానికి వంశీ అన్నాడు

"శ్రీమన్! దీన్నినువ్వు అంత తేలికగా తీసి పారెయ్యకు. ఎంత పరిస్థితులు బాగున్నా మనిషి నైతిక ప్రవర్తన నిలపెట్టుకోవడం కూడా చాలా ముఖ్యం. ఇటువంటి పరిస్థితిలోనే దారి తప్పడం చాలా సులభం.

శ్రీమన్! నువ్వు ఇప్పటికీ విజయ్ బాబు కేవలం చిన్నప్పుడు తల్లిదండ్రుల అండ, ఇంకా పెద్దయ్యాక ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వలన దారి తప్పాడంటున్నావా? మరి, మన చందు జీవితం మాత్రం వడ్డించిన విస్తరి

లాంటిదే ఐనా చందు కూడా దారి తప్పాడు దేని వలన?" అని.

ఇప్పుడు వంశీ మా బాల్య మిత్రుడు చందూ జీవితం గురించి ప్రస్తావించే సరికి నాకు గుండె కలుక్కుమంది.

వంశీ ఇంకొక జ్ఞాపకాల తుట్టెని కదిలించాడు

*( ముగింపు వచ్చే సంచికలో)*

COMMENTS